
# ప్రేమ

స్పీడు పెరిగిన కొద్దీ గరరర అంటోంది బస్సు. అది చాలదన్నట్టు బస్సు నిండా పిల్లల గోల, పెద్దల అరుపులు. బస్సులోంచి కనపడే దృశ్యాలు ఎంతో మనోహరంగా



ఉన్నాయి. మనకూ ప్రకృతికీ మధ్య అంటీ అంటనట్లు సంబంధమున్నప్పుడు ఎంత ఆహ్లాదంగా వుంటుందో! పశువులు మేత మేయడం, బాల బాలికలు వాటి వెంట ఆడుతూ పాడుతూ అదిలించడం, జొన్నచేన్లు పచ్చగా ఊగడం, కరెంటు వైర్ల మధ్యలోంచి గాలి ఈలవేస్తూ సాగటం, దూరం నించి పొలంలో పాడే పల్లెపాటలు లీలగా సోకడం, తుమ్మ, వేప, మర్రి, రావి, ఈత, తాటి చెట్లు అలాగ పలకరిస్తూ వెనకబడి పోవడం. ట్రాక్టర్ల చప్పుడు, సద్దులు మోసుకెళ్తున్న పల్లెపడుచులు. ఈ విశ్వాన్ని అంటీ అంటకుండా ప్రేక్షకునిలా చూస్తుంటే ఎంత ఆనందమో, ఆనందించే ప్రజలు చరిత్రను నిర్మించ లేరంటారు. ఏమోగానీ ఆనందంగా జీవించడం మాత్రం చరిత్ర కాకూడదా!

నా ఆనందంలో నేనుంటే మా ఆరేళ్ళ నవత ఆ దృశ్యాల్ని చూపిస్తూ ఏదేదో అడుగుతోంది. తపోభంగమైనంత బాధ, విసుగు కలుగుతోంది నాకు. చెప్పి చెప్పి విసుగొచ్చింది. గుర్రుగా చూశాను. ఇహ లాభం లేదని నవత నన్నొదలి అమ్మ పక్కన చేరింది.

ప్రకృతి ఎంత రమణీయమైంది. ఎంత చూసినా తనివి తీరదు. ఎంత ఆనందించినా యింకా మిగిలిపోతూనే వుంటుంది. ప్రకృతి, ప్రకృతితో పెనవేసికొన్న నా జీవితం, అనుభవాలు ఎన్నెన్నో. మనస్సు ఎక్కడెక్కడి జ్ఞాపకాలకో ఉరకలు వేస్తోంది. పల్లె ప్రకృతి నుండి పట్నం దాకా పరుగిడిన జీవితంలో ఎన్ని మలుపులో.

నా పెళ్ళే ఒక విచిత్ర సంఘటన అనుకుంటే మా మరదలు అరుణ పెళ్ళి మరీ విచిత్రం. అంత అరిచి గీపెట్టిన అరుణ యింత తొందరగా పెళ్ళికి ఎలా ఒప్పుకుందో. ఎన్ని పెద్ద కబుర్లు చెప్పేదో. అవన్నీ వింటుంటే అరుణ ఎంతో ఎత్తుకు ఎదిగిపోయిందని పించేది. అరుణ సాహసం, తెలివీ చూస్తుంటే నాలో ఈర్ష్య, సంతోషం కలగలిసేవి. ఆమె మాటలు నన్నూ నా గతాన్ని గుర్తుచేసి ఎద్దేవా చేయడం లేదు గదా అన్పించేది ఒక్కోసారి. కానీ ఆ కళ్ళలో ఎంత అమాయకత్వం, ఎంత నిర్మలత్వం.

కాలేజీ విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్న అరుణ యింకేదో భవిష్యత్తును వెతుక్కుంటుందనుకున్నాను గానీ 'పెళ్ళి' చేసికొని యిల్లాలుగా మిగిలిపోతుందనుకోలేదు.

నా ఊహలు యిప్పుడు నాకే నవ్వు తెప్పిస్తున్నాయి. ఆమె భవిష్యత్తు యిలా వుండాలని ఆశించే హక్కు నిజానికి నాకుందా? నా గూర్చి అలాగే ఆశించిన వాళ్ళు యిప్పుడు ఏమనుకుంటున్నారు. అసలు ఒకరి గురించి మరొకరు ఆశించే హక్కుందా?

ఇలా ఒకరి గురించి మరొకరు ఆశించడం మాత్రం వ్యక్తిగత ఆస్తి హక్కు తాలూకు భావం కాదా ?

ఒకరి గురించి మరొకరు ఏమీ ఆశించకుండా బతకడం సాధ్యమవుతుందా? అప్పుడు సంఘ జీవితానికి అర్థం మిగిలి వుంటుందా ? ఏమిటో ఎడతెగని ప్రశ్నలు.

అరుణ గురించి ఆశించే హక్కు నాకు లేదు. నా గురించి యితరులు కూడా ఆశించే హక్కు లేదు. అలా పొసగుతుందా? నాకిష్టం వున్నా లేకపోయినా యీ వృత్తి చేయాల్సిందే. నా కుటుంబాన్ని పోషించాల్సిందే. ఇంటి కిరాయి, స్కూటర్ రిపేర్లు కట్టాల్సిందే.

ఈ ప్రపంచానికి ప్రేక్షకుడిలా మిగిలిపోతే ఎంత బాగుండునో! ప్రేక్షకుడిగా వుండిపోవడం అంటే యీ సంబంధాలకు అతీతంగా మసలుకోవడమా? ఈ సంబంధాల్లో వుంటూనే స్పందనలకు ప్రేక్షకుడిలా నాలో నేను గమనంలో వుండడమా!

మా ఆవిడ విమలతో నేను అలా వుంటే భరించగలదా ?

అరుణ పెళ్ళి చేసికొంటున్నది దేన్నో ఆశించడానికేనా? బంధాల్లో చిక్కుకోవాలని ఎగిరే పక్షులకు ఉబలాటం ఎందుకో! పెళ్ళి, పిల్లలు యివన్నీ గోడలు లేని జైలు జీవితమని ఎగిరే పక్షులకు అర్థం చేయించడం ఎలా? అన్నీ తీరిన వారు యిలాగే చెపుతారు. ఇందులో ఏమీ లేకపోతే నీవెందుకు పెళ్ళి చేసుకొన్నావు బావా? అని అరుణ అడిగితే తానేం చెప్పగలడు. నా అనుభవం నుంచే యీ నిర్ణయానికి వచ్చానంటే నీ అనుభవం నాకు లేకుండా నీ నిర్ణయానికి నేను రావడం ఎలా సాధ్యం ? అని అరుణ ప్రశ్నిస్తే జవాబేది? ఈ ప్రశ్నే ఈ అనుభవాసక్తే జీవితాన్ని యింకా యిలా నడిపిస్తోందేమో!

అరుణ గురించి నాకే హక్కూ లేదనుకొంటున్న నేను అరుణ పెళ్ళి చేసికొంటుందంటే యింతగా ఎందుకు బాధ పడ్తున్నాను. అరుణ నాకు మరదలైనందుకా? యిద్దరి ఆలోచనలూ ఒకటైనందుకు హక్కులు సాధించుకోవాలనుకున్నానా?

అరుణ ఎదగడంలో నా ప్రమేయం వున్నమాట నిజం. ఒక చెల్లెలు ఎదగడానికి అన్నయ్య ఎంత కృషి చేస్తాడో అంత కృషి చేసిన మాట నిజం. ఆమెలో హృదయం వుంది. హృదయానికి తగ్గ స్పందనలున్నాయి. అందుకే అందరితో కల్సి కాలేజీ విద్యార్థి ఉద్యమాల్ని నిర్మించింది. ఆమె చలాకీతనం చూస్తే ఎవరైనా తనకు అలాంటి స్త్రీయే భార్య కావాలనుకుంటారు. నిజం చెప్పొద్దూ అరుణ వ్యక్తిత్వం ఎదుగుతున్నకొద్దీ అరుణను చేసికోవాల్సిన నేను ఆమె అక్కను పెళ్ళి చేసుకొన్నానేమిటీ? అని అన్పించిన క్షణాలు లేకపోలేదు.

ఉద్యమంలోంచి నేను బయటకు వచ్చినా దాని మీద తీపి చెరిగిపోలేదు. ఈ తీపి వ్యక్తినిష్టం కాదు. నన్ను నేనుగా ఎదిగించుకోవడానికి ఉద్యమం ఒక చక్కని వాతావరణాన్నిచ్చింది. నన్ను నేను సమాజానికి అర్పించుకోవడానికి ప్రేరణ నిచ్చింది. అరుణ నాలాగే ఉద్యమానికి నాలుగైదేళ్ళయినా అర్పణ భావంతో పని చేస్తుందని ఆశించడానికి సమాజం పట్ల గల ప్రేమే కారణం. కానీ అరుణ తనదైన మార్గం ఎన్నుకుంది. నన్ను చూసి అరుణ యిలా మారిపోలేదు కదా! ఉద్యమంలో లేకపోయినా నేను ఉద్యమాన్ని ప్రేమిస్తూనే వున్నానని అరుణ యిప్పటికీ అర్థం చేసుకోలేదని ఎలా అనుకోను. నన్ను చూసి ఉద్యమాల్లోకే వెళ్ళకూడ దనుకునేదైతే యింతకాలం ఎలా పని చేస్తుంది?

నేను ఉద్యమం నుంచి బయటకొచ్చి సరండరయిపోయాను. ఆర్నెల్లకు బెయిలుపై జెయిలు నుంచి విడుదలయ్యాను. కొంతకాలం నిరుద్యోగిగా వుండిపోయాను. పెళ్ళి చేసికొమ్మని బంధుమిత్రుల ఒత్తిడి. నేను బతికే దారిలేదు. నాకొక పెళ్ళా! నవ్వొచ్చింది. నీ కోసం బతకడం నీకు అలవాటు కాలేదు. ఇతరుల కోసం బతకడమే నీ జీవితం అనుకున్నావు. అందువల్ల ఒంటరిగా వుంటే నీ కోసం నీవుగా జీవించడం, జీవికనేర్పాటు చేసికోవడం అసాధ్యం అన్నారు మిత్రులు. పెళ్ళి చేసికొంటే యితరుల కోసం అంటే నీ భార్యా పిల్లల కోసం బతుకును బతుకుగా మార్చుకోవడం సాధ్యమేనన్నారు.

ఆ మాటలు ఎంతగానో ఆకర్షించాయి. నచ్చిన మాటలు హృదయానికి హత్తుకోవడంలో ఆత్మవంచన కూడా వుంటుందా? ఏమో! ఇప్పుడైతే అలాగే అన్పిస్తోంది. ఇతరుల కోసం బతకడం అనే మాటే గొప్ప ఆత్మవంచన అన్పిస్తోంది. ఆనాటి ఆలోచనలు గుర్తొస్తే నవ్వొస్తోంది. ఎంత అమాయకత్వం. ఇతరుల కోసం బతుకుతున్నాను. అనుకోవడం తనను తాను మోసగించుకొనే పలాయానవాదమా? ఇపుడు అవుననిపిస్తోంది. ఆనాడు ఈ మాటలనే వారిని వర్గశత్రువును చూసినట్టు నమిలి మింగేయాలని చూసేవాన్ని.

ఇతరుల కోసం బతకాలనే వాంఛ నుంచి అరుణ బయటపడిందా! అందుకే పెళ్ళికి ఒప్పుకుందా? నిన్ను నిన్నుగా ప్రేమించుటకు తోడొకరుంటే మహాభాగ్యమన్నాడో కవి. ఎంత గొప్ప భావన. ఆమెను ఆమెగా గుణదోషాల్తో సహా అంగీకరించి ప్రేమించే హృదయం అరుణకు లభించిందా? ఆలా లభించిననాడు ఎవరైనా ఇతరుల కోసం బతుకుతున్నాను అనే ఆత్మవంచన మంచి బయటపడతారా?

అరుణ తనను తాను తెలుసుకోవడంలో చలం పాత్ర ఎక్కువా? రంగనాయకమ్మ పాత్ర ఎక్కువా? ఓల్గా పాత్ర ఎక్కువా? స్త్రీవాదమే ఆమెను నా అంచనాలకు భిన్నంగా ఎదిగేట్టు చేసిందా ?

నిస్సారంగా కన్పిస్తున్న నాయీ గానుగెద్దు జీవితంలో అరుణకు ఆకర్షణ ఏం కన్పడిందో! స్త్రీవాదులు గానుగెద్దు జీవితాన్ని కొత్తరూపంలో ఆదర్శీకరించడం లేదు గదా! మరయితే అరుణ స్త్రీవాదుల దోస్తానీలో పెళ్ళికెందుకు నిర్ణయించుకుంది?

నాకీ జీవితంపై విరక్తి కలిగింది. నాయీ విరక్తినించే అందర్నీ అంచనా వేస్తున్నానా! నాయీ జర్నలిస్టు వృత్తీ, సంసారమూ, హిపోక్రసీ సంబంధాలు నాకు మరింత విసుగునే ప్రసాదించాయి. వార్తల్లో మార్పేకానీ ఆలోచించే విధానంలోగానీ, జీవితంలోగానీ మార్పు పెద్దగా కానరాదు. అందరూ యిలా తమ కళేబరాలను మోసుకుంటూ ఎందుకిలా తమదికాని జీవితాన్ని బతికేస్తున్నారు.


నిత్యనూతనంగా వుండాలనే జర్నలిస్టు చపలచిత్తుడుగా కనపడతాడు కాబోలు. ఏదో సాధించాలనే పట్టుదలా, పౌరుషమూ వెన్నాడి రెండేళ్ళు వార్తాపత్రిక తీయడానికి పురికొల్పింది. అప్పులు, దాని తాలూకు అనుభవాలు మాత్రం మిగిలిపోయాయి. దినపత్రిక విలేకరిగా కుదురుకున్నా తృప్తి మిగల్లేదు.

ఈ జర్నలిస్టు జీవితం రాజుగారు తొడుక్కునే కవచం లాంటిది. అది రక్షణ నిస్తుంది. అందంగానూ కనపడుతుంది. కానీ అది అతుక్కుని ఉన్నంతసేపూ ఉక్కపోత, ఎటూ కదలనీయని బందీ జీవితం. అనుభవిస్తే కానీ అర్థం కాదు. అందుకే జర్నలిస్టు అందరికీ రాజుగారి కవచంలా అందంగా కనపడతాడు కాబోలు.

ఏదో సాధిద్దామని ఎన్నుకున్న ఈ వృత్తిలో ఏమీ సాధించనవసరం లేదనుకుంటేనే స్థిరపడడం సాధ్యం అని త్వరలోనే తెలిసివచ్చింది. అయినా అందరూ

ఏదో సాధిస్తున్నవాడిగానే గౌరవిస్తున్నారు. అదేం విచిత్ర ప్రపంచమో. ఏదో గొప్పగా జీవితాన్ని త్యాగం చేశాననుకున్నన్నాళ్ళు ఈ హిపోక్రసీ ప్రపంచం నన్ను ఎద్దేవా చేసింది. పలాయనవాది అంది. జీవితం నుంచి పలాయనం చిత్తగించిన నన్నిప్పుడు గొప్ప జర్నలిస్టువని ఊరేగిస్తోంది.

సడెన్ బ్రేక్ పడి నా తల ఇనుప రాడ్‌కు ఢీకొట్టింది. ఒక్కసారి గతం వదిలి వర్తమానంలోకి వచ్చాను. ఏడ్పులు అరుపులతో బస్సు అదిరిపోతోంది. అందరూ గబగబా దిగుతున్నారు. యాంత్రికంగా నేనూ మా ఆవిడతో పాటు దిగాను. ఎదురుగా నక్సలైట్లు. బస్సును ఎందుకు కాలబెట్టాలనుకుంటున్నారో చెప్తున్నారు.



పిల్లలూ, స్త్రీలూ తమ ప్రయాణం మధ్యంతరంగా ఆగిపోవడంతో గొల్లుమన్నారు. ఫలానా తప్పుడు రాతల విలేకరి వీడే అని నన్ను ఎక్కడ గుర్తుపడతారోనని సంకోచించాను. మందిని చాటుచేసికొని గమనిస్తున్నాను.

నవత ఏడుస్తోంది. బస్సు కుదుపుకి ఎన్ని దెబ్బలు తాకినయో. ఇద్దరు స్త్రీలు ధైర్యం చేసి దళం కాళ్ళు పట్టుకోబోయారు. దళం వెనక్కి తగ్గి వాళ్ళనక్కడే వుండమని కోరారు. స్త్రీల నివేదన నిన్ను దళం కొద్దిగా కరగనారంభించింది. ఈ బస్సుని

కాల్చడంలేదు. ఒకటి మాత్రం ప్రభుత్వానికి చెప్పండి. మేమూ మానవత్వమున్న మనుషులమేనని.

క్షణాల్లో వాతావరణం మారిపోయింది. విప్లవ నినాదాలు హోరెత్తాయి. అందరూ మళ్ళీ గబగబా బస్సెక్కారు. నేను మళ్ళీ నా ఆలోచనలెక్కాను. బస్సు కదిలింది.

అరుణ పెళ్ళి నా పెళ్ళి వంటిది కాదు. ఇతరుల కోసం బతకాలనుకుంటూ వచ్చిన క్రమంలో నేను పెళ్లి చేసికొన్నాను. తన కోసమే తాను బతుకుతాను అని నిర్ణయించుకోవడంతో అరుణ పెళ్ళి చేసికొంటున్నది. నా పెళ్ళిలో స్వేచ్ఛ నా చేతిలో లేదు.

ఇతరుల కోసం అనుకోవడంతోనే నా స్వేచ్ఛ హరించింది. నా పెళ్ళి నా కొరకే, నా జీవితం నాదే అని అనుకోవడంలో అరుణకు ఎంతో స్వేచ్ఛ వుంది. అపుడు పెళ్ళి ఆమెకు బంధం కాదనుకుంటాను. మరి అరుణ ఏం అనుకుంటున్నదో! అసలు ఆమె గురించి నాకు యింత ఆసక్తి వుండడం కూడా ఒక బంధమేనేమో. ఆమె ఏమనుకుంటేనేమి? ఆమెను ఆమెగా గౌరవిస్తాను. ఆమెను ఆమెగా గుర్తించడానికి నాకేమిటి అభ్యంతరం?

ఈ ప్రశ్న కలగడంతోనే నా మనస్సు ఎంతో తేలికైపోయింది ఆలోచనలు ఆగిపోయి. బరువు దిగిపోయింది. ఆనందం పురివిప్పింది. హృదయాన్ని ఆలోచనలు గెలవాలని నిరంతరం ప్రయత్నిస్తాయి. ఆలోచనల్ని హృదయం గెలిచినపుడు ఎంత సంతోషమో. ఇపుడు అరుణ పెళ్ళిలో నేనూ విమలా కొత్త జంటలా ఎగిరి గంతులేయాలనిపిస్తోంది అచ్చం చిన్నపిల్లల్లా.

ఇపుడు ప్రకృతి మరింత అందంగా పరిమళిస్తోన్నట్టనిపిస్తోంది.

స్వచ్ఛమైన ప్రేమకు ఆశించదాల్తో నిమిత్తం లేదు...... యథాతథంగా స్వీకరించి ప్రేమించడమే ఉత్తమ ప్రేమ.

**– (రచనాకాలం : 1986), 5 ఫిబ్రవరి 1996, ఆదివారం ఆంధ్రజ్యోతి**